[redacted]

29 AUG 2020

ENADU

## భావితరాలకు అందించాలి...



మాతృభాషలో విద్యా బోధన వల్ల విషయ పరిజ్ఞానం సులభమవుతుంది. అమెరికా వంటి దేశాల్లో ఉన్న మన తెలుగువారు ఈ కరోనా కాలంలోనూ అంతర్జాలం ద్వారా తమ పిల్లలకు తెలుగు నేర్పిస్తున్నారు. అపారమైన సాహితీ వారసత్వ సంపద మన భాష సొంతం. దీన్ని రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. తెలుగు ప్రాధాన్యాన్ని గుర్తెరిగి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భాషపట్ల పిల్లలకు ప్రేమ, ఇష్టం కల్గించేలా శ్రద్ధ చూపాలి. ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్ వివిధ దేశాల్లోని కవులతో ఆగస్టు 15న నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొని నా కవితను వినిపించా.

– దాట్ల దేవదానంరాజు, కవి, కథకుడు, స్ఫూర్తి సాహితీ సమాఖ్య అధ్యక్షుడు.

యానాం: యానాంలో శుక్రవారం ఒక్కరోజే 70 కేసులు నమోదయ్యాయని వైద్యాధికారులు తెలిపారు. దీంతో యానాంలో మొత్తం 800లకు పైగా కేసులు నమోదుకావడంతో ఆందోళన నెలకొంది.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

యానాం: దరియాలతిప్పజెట్టీ చేరువలో గురువారం సాయంత్రం ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు యానాం ఎస్సై సుబ్బరాజు తెలిపారు.

యానాం: అనారోగ్య కారణాలతో గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన యానాం కాపు ఉద్యోగులు, దివ్యాంగుల సంక్షేమ సంఘాల గౌరవాధ్యక్షుడు నున్నా వెంకటరామకృష్ణారావు(72) మృతదేహం గుత్తెనదీవి సమీపం వద్ద

గోదావరిలో శుక్రవారం లభ్యమైందని ఎస్సై సుబ్బరాజు తెలిపారు.

[redacted]

29 AUG 2020

ANDHRA JYOTHI

## బురదగా రాజీవ్‌గాంధీ బీచ్ రోడ్డు

● శుభ్రం చేస్తున్న సిబ్బంది



రాజీవ్‌గాంధీ బీచ్ రోడ్డులో శుభ్రం చేస్తున్న సిబ్బంది

యానాం, ఆగస్టు 28: వరద తాకిడికి రాజీవ్‌గాంధీ బీచ్‌లోని పర్యాటక బోట్‌హౌస్ పూర్తిగా నీటమునిగింది. ఈబోట్‌హౌస్ ద్వారా పలువురు పర్యాటకులను గౌతమిగోదావరిలో విహరింపచేసేందుకు ప్రత్యేక బోట్లు ఉన్నాయి. అయితే వరదతో బోట్లను టైడల్‌లాక్ సమీపంలోని నిలిపారు. వరద తగ్గడంతో రాజీవ్ గాంధీ బీచ్, ఫెర్రీరోడ్డులోని విగ్రహాలను అగ్నిమాపక, మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో పర్యాటకులకు రాజీవ్‌గాంధీ బీచ్‌ను అందుబాటులో తెచ్చేందుకు నిర్వాహకులు, యంత్రాంగం చర్యలు చేపడుతుంది.

## యానాంలో 55 పాజిటివ్ కేసులు

యానాం, ఆగస్టు 28: యానాంలో శుక్రవారం 55కేసులు నమోదయ్యాయి. కేసుల సంఖ్య 800కి చేరాయి. పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా 4,745 కేసులు యాక్టివ్‌లో ఉన్నాయని మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. కరోనా నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మల్లాడి చెప్పారు.

## రామకృష్ణారావు మృతదేహం లభ్యం

యానాం, ఆగస్టు 28: స్థానిక జిక్రియనగర్‌లోని చైల్డ్‌లైన్ ప్రతినిధి నున్న వెంకటరామకృష్ణారావు మృతదేహం గౌతమీ గోదావరిలో లభ్యమైంది. రెండు రోజులు క్రితం బాలయోగి వారధి పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బంధువులు భావించారు. మత్స్యకారులు గాలించగా శుక్రవారం ఉదయం ఐలాండ్ వద్ద మృతదేహం లభ్యమైంది. ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు.

29 AUG 2020 SAKSHI

## మరో వివాహానికి భర్తను ప్రోత్సహించిన భార్య

యానాం: దాంపత్య జీవితంలో భార్య.. తన భర్త మరొకరిని కన్నెత్తి చూసినా తట్టుకోలేదు. పైగా అనేక విధాలుగా నిఘా పెడుతుంది. కానీ కట్టుకున్న భార్యే భర్తను మరొక వివాహానికి ప్రోత్సహించిన ఘటన ఇది. నియోజకవర్గ పరిధిలోని ఒక తీర గ్రామంలో జరిగిన అరుదైన ఈ ఘటనతో అందరూ అవాక్కయ్యారు. కాకినాడకు చెందిన 30 సంవత్సరాల వి.విష్ణు, సత్యవేణి దంపతులు ఆ తీర గ్రామంలోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. వారికి ఇద్దరు సంతానం. ఈ నేపథ్యంలో ఆ ఇంటి యజమాని కుమార్తె అయిన బాలికపై విష్ణు కన్నుపడింది. మెల్లగా లోబర్చుకోవడం ప్రారంభించాడు. దీనికి ఆయన భార్య నుంచి ప్రోత్సాహం లభించడంతో పూర్తిగా తన వశం చేసుకుని, పెళ్లి చేసుకోవడానికి నిర్ణయించుకునే వరకూ వెళ్లింది. ఒక రోజు బాలిక కనిపించకపోవడంతో బాలిక తల్లిదండ్రులు చైల్డ్‌లైన్ 1098కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చైల్డ్‌లైన్ స్పందించి చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మీబాయికి తెలిపారు. ఆమె తక్షణం స్పందించి పోలీసుల సహాయంతో నిజానిజాలను రాబట్టారు. అప్పటికే కాకినాడలో ఆ బాలికకు భార్యే దగ్గరుండి వివాహం జరిపించిందని తెలియడంతో వారంతా నిర్ఘాంతపోయారు. అయితే బాలిక వయస్సు 17 సంవత్సరాల 8 నెలలని, బాల్య వివాహం చట్ట ప్రకారం చెల్లదని స్పష్టం చేశారు. కాకినాడలో ఉన్న బాలికను తల్లిదండ్రులకు అప్పగించి, నిందితులు విష్ణు, సత్యవేణి దంపతులపై పోక్సో చట్ట ప్రకారం కేసు నమోదు చేశారు. యానాం ఎస్సై కట్టా సుబ్బరాజు, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ రాము, సిబ్బంది దేవి శ్రీదేవి బాధితురాలి సమగ్ర వివరాలు సేకరించడంలో విశేష కృషి చేశారు.

## గోదావరిలో గల్లంతైన మృతదేహం లభ్యం

### చైల్డ్‌లైన్ ప్రతినిధి రామకృష్ణారావుదిగా గుర్తింపు

యానాం: గౌతమీ గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమయ్యింది. ఈ మృతదేహం యానాం చైల్డ్ లైన్ ప్రతినిధి, ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ వ్యవస్థాపకుడు నున్న రామకృష్ణారావు(72)గా గుర్తించారు. ఈ నెల 26న ఆయన యానాం- ఎదుర్లంక బాలయోగి వారధి పై నుంచి గోదావరిలోకి దూకి గల్లంతైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఆచూకీ కోసం గాలించగా గోదావరి లంకల ప్రాంతంలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని స్థానిక జీజీహెచ్‌కు తరలించి పోస్టుమార్టం చేసిన అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

**ఆయన మృతికి సంతాపం :** చైల్డ్‌లైన్ సంస్థ, ఎడ్యుకేషనల్ సొసైటీని యానాంలో స్థాపించి, దివ్యాంగ బాలల పాఠశాలలను నిర్వహిస్తూ, వారి హక్కుల కోసం నున్న రామకృష్ణారావు ఎంతో పోరాటం చేశారు. ఆయన ఆకస్మికంగా మృతి చెందడం యానాంలో అందరూ విస్మయానికి గురయ్యారు. బాలలహక్కులు, బాల్య వివాహాల నిషేధ చట్టంపై వందలాది సదస్సులు నిర్వహించారు. ఆయన చేసిన సేవలకు గాను 2016లో పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి అనేక అవార్డులను ఎల్జీ కిరణ్‌బేడీ, సీఎం నారాయణసామిల చేతుల మీదుగా అందుకున్నారు. ఆయన మృతికి పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ రాము, కాపు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు, విశ్రాంత ఉద్యోగుల సంఘం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది.

VELUGU

29 AUG 2020

## యానాంలో 55 కరోనా పాజిటివ్ కేసులు నమోదు

యానాం, ఆగస్టు28(వెలుగు విలేకరి): యానాం నియోజకవర్గంలో శుక్రవారం కొత్తగా 55 కరోనా పాజిటివ్ కేసులు నమోదయినట్లు అధికారులు తెలిపారు. ఈ కొత్తగా నమోదైన వాటితో మొత్తం ఇప్పటివరకు సంఖ్య 800 వరకు చేరినట్లు తెలిపారు. వీటిలో 546 మంది వైరస్ నుండి కోలుకొని డిశ్చార్జ్ అయ్యారని, 234 మంది చికిత్స పొందుతున్నారని, 20 మంది వైరస్ బారిన పడి మరణించినట్లు తెలిపారు. కొత్తగా నమోదైన ప్రాంతాలను అప్రమత్తం చేసి పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పుదుచ్చేరి వ్యాప్తంగా ఇప్పటివరకు 13,024 మందికి వైరస్ సోకిందని, 8,080 మంది వైరస్ నుండి కోలుకున్నారని, ,2,281 మంది చికిత్స పొందుతున్నారని ,2,464 మంది హోమ్ ఐసోలేషన్ లో ఉన్నారని,199 మంది మరణించారని హెల్త్‌బులిటెన్ ద్వారా తెలియచేశారు.

### గల్లంతైన నున్న రామకృష్ణారావు

## మృతదేహం లభ్యం



యానాం, ఆగస్టు28(వెలుగు విలేకరి): ఈ నెల 26న ఎదుర్లంక జి.ఎం.సి.బాలయోగి వారధి పైనుండి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన యానాం జిక్రియానగర్‌కి చెందిన ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ వ్యవస్థాపకులు ,చైల్డ్ లైన్ అడ్వైజర్ నున్న వెంకట రామకృష్ణారావు మృతదేహం శుక్రవారం ఉదయం టైడల్‌లాక్ సమీపంలో లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పంచనామా చేసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. కేసు నమోదు చే దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. .దరియాలతిప్ప అవుట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోదావరి ప్రాంతంలో గుర్తుతెలియని మృతదేహంను గుర్తించామని, మృతదేహం బాగా పాడవటంతో అక్కడే మృతదేహానికి పంచనామా చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ముమ్మరంగా పారిశుధ్య పనులు



యానాం, ఆగస్టు28(వెలుగు విలేకరి): యానాం :నియోజకవర్గంలో ఇటీవల వచ్చిన వరదల కారణంగా ప్రభావిత ప్రాంతాల్లో మట్టి చెత్త పేరుకుపోవడంతో ఆ ప్రాంతాల్లో మునిసిపాలిటీ పారిశుధ్య సిబ్బంది ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు .ఈ సందర్భంగా కొండ వెంకటరత్నంనగర్ ,ఫెర్రీ రోడ్డు ఫ్రాన్స్ తిప్పా, గురు క్రిష్ణ కాలనీ తదితర ప్రాంతాల్లో మునిసిపల్ పారిశుధ్య సిబ్బంది సూపర్‌వైజర్ రాంబాబు ఆధ్వర్యంలో పేరుకుపోయిన మట్టిని, చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లి పారిశుధ్య పనులు మెరుగుపరిచారు. రాజీవ్ బీచ్ ప్రాంతంలో పేరుకుపోయిన మట్టిని ,చెత్తను తొలగించారు. కంటైన్మెంట్ జోన్లలోనూ పారిశుధ్య పనులు చేపట్టారు.



PRAJA SAKTHI

29 AUG 2020

## యానాంలో పెరుగుతున్న ఆత్మహత్యలు

యానాం : యానాంలో రోజురోజుకూ ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు పెరుగుతున్నాయి. మూడు రోజుల నుంచి యానాం బాలయోగి వారధిపై నుంచి గోదావరిలో నలుగురు దూకి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ నెల 25న అమలాపురానికి చెందిన పెదపూడి రమేష్(28) మద్యం మత్తులో స్నేహితులతో గొడవపడి వారధిపై నుంచి గౌతమి గోదావరిలో దూకేశాడు. అదేరోజు రాత్రి యానాం తోట వారి వీదికి చెందిన ఉద్దేశ వెంకటేశ్వరరావు(60) వారధిపై నుంచి దూకి గల్లంతయ్యాడు. ఈ నెల 26న యానాం జిక్రియ నగర్‌కు చెందిన నున్న వెంకట రామకృష్ణారావు(70) వారధిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వీరి ఆచూకీ ఇంకా దొరకలేదు. ఇదిలా ఉండగా ఈ నెల 27న మద్యం మత్తులో ఒక వ్యక్తి వారధిపై నుంచి దూకి ప్రాణ భయంతో ఈదుకుంటూ ఒడ్డుకు చేరాడు. పోలీసులు అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపేశారు. ముగ్గురి కోసం గాలింపు చర్యలుచేపట్టామని ఎస్ఐ తెలిపారు.